క్లుప్తంగా

క్రీడాపోటీల్లో సత్తా చాటిన పాములవాక విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నారాయణ, పీడీ అచ్యుతరావు

కోటవురట్ల: మండల స్థాయి క్రీడా పోటీల్లో పాములవాక కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి నియోజకవర్గస్థాయికి ఎన్నికయ్యారు. అండర్ 14,17 విభాగాలలో ఖోఖో, కబడ్డీ,వాలీబాల్,బ్యాడ్మింటన్,అథ్లెటిక్స్ యోగా, చెస్ పోటీల్లో పలువురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారు. విజేతలను హెచ్ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

25న నాగులాపల్లి పీఏసీఎస్ మహాజన సభ

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ మహాజన సభ ఈ నెల 25న జరుగుతుందని సంఘ సీఈవో మళ్ల స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు మహాజన సభ జరుగుతుందన్నారు. సంఘ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి వి.జ్యోతీశ్వరరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి రైతులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని స్వామి కోరారు.

పాయకరావుపేట ఎస్ఐగా పురుషోత్తం



పాయకరావుపేట: పాయకరావుపేట ఎస్ఐగా జె.పురుషోత్తం శనివారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం వన్ టౌన్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం సీఐ జి.ఎన్.అప్పన్నను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా అన్న సమారాధనలు



కాపుపేటలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీగా అన్న సమారాధనలు నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా మునగపాక, నారాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలకు భక్తులు భారీగా తరలివచ్చారు. మునగపాక మెయిన్‌రోడ్డు, బైపాస్ రోడ్డులోని కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మరిడిమాంబ పండగ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో ఈ నెల 26న మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో పండగకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సందర్భంగా నిర్వహించే రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఉత్సవకమిటీ చైర్మన్ వేగి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం

మునగపాక: ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యలమంచిలి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని చెప్పారు. డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో మన్మథరావు,ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

హలదారి అవస్థలు



మాసాహేబుపేట వద్ద తాండవ నదిని దాటుతున్న రైతులు



పంపానది పై రత్నయ్యమ్మపేట వద్ద శ్రమదానంతో మత్స్యకారులు నిర్మించిన తాత్కాలిక వంతెన

- కాజ్‌వేలు లేక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు, మత్స్యకారులు
- పలుమార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోని అధికారులు

పాయకరావుపేట: మండలంలో సత్యవరం, మాసాహేబుపేట, కుమారపురం, రత్నయ్యమ్మపేట రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారిలేక అవస్థలు పడుతున్నారు. పొలాలు తాండవ, పంపానదుల ఆవల ఉండడంతో వారు నరక యాతన అనుభవిస్తున్నారు. మాసాహెబుపేట గ్రామం వద్ద తాండవ నదిపైన, పెద్దూరు రత్నయ్యమ్మపేట వద్ద పంపానది పైన కాజ్‌వేలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు రెండు ప్రాంతాల వారు అధికారులు వినతులు సమర్పించినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీంతో తాటి చెక్కలతో నిర్మించుకున్న తాత్కాలిక వంతెనలపై ప్రమాదకర పరిస్థితుల్లో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో నదుల్లో నీటి ఉధృతి కారణంగా ఆ చెక్కలు తరచూ కొట్టుకుపోతున్నాయి.

సత్యవరం, మాసాహేబుపేట గ్రామాలకు చెందిన వంద మంది రైతులకు తాండవ నది అవతల సుమారు 150 ఎకరాలు ఉన్నాయి. తమలపాకులు, కొబ్బరి, మామిడి తోటలతో పాటు పొలాలు, పశువుల పాకలు ఉండడంతో నిత్యం నదిని దాటి ఆవలవైపు వెళ్లాలి. మాసాహేబ్ పేట వద్ద కాజ్‌వే నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులే తాటి చెక్కలు, సిమెంట్ స్తంభాలతో తాత్కాలిక వంతెనను స్వయంగా నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ఆ వంతెన కొట్టుకుపోతోంది. చెక్కల వంతెన కొట్టుకుపోతే పంట పొలాలకు వెళ్లడానికి సత్యవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం గ్రామాల మీదుగా సుమారు 15 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. మండలంలో పెద్దూరు రత్నయ్యమ్మపేట గ్రామం వద్ద పంపానది పై కూడా కాజ్‌వే లేకపోవడంతో రైతులు, మత్స్యకారులు అవస్థలకు గురవుతున్నారు. కుమారపురం, రత్నయ్యమ్మపేట గ్రామాలకు చెందిన రైతులు, మత్స్యకారులు నిత్యం నదిని దాటి వెళితే గాని రోజువారీ పనులు చేసుకునే అవకాశం లేదు. దీంతో ఇక్కడ కూడా తాటి చెక్కలతో వంతెన ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాజ్‌వే నిర్మించాలని కోరుతున్నారు.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు



తాండవ నది పై కాజ్‌వే నిర్మించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వర్షాకాలంలో మా పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాండవ నది పై మాసాహేబుపేట వద్ద కాజ్‌వే నిర్మించాలి. – గెద్దమూరి శ్రీనివాసరావు, రైతు, మాసాహేబుపేట

కాజ్‌వే నిర్మించాలి



రత్నయ్యమ్మపేట వద్ద పంపానది పై కాజ్‌వే లేకపోవడం వల్ల రైతులు, మత్స్యకారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలికంగా నిర్మించుకున్న వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి పంపానది పై కాజ్‌వే నిర్మించాలి.

– నీలాపు వెంకటరెడ్డి, రైతు కుమారపురం

మూడేళ్లలోపే సార్వత్రిక ఎన్నికలు

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు

యలమంచిలి రూరల్: కేంద్ర కేబినెట్ జమిలి ఎన్నికలకు ఆమోదం తెలపడంతో మూడేళ్లలోపే రాష్ట్రంలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని యలమంచిలి మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు (కన్నబాబు) అభిప్రాయపడ్డారు.యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా మూడేళ్లలోనే ఎన్నికలకు అంగీకరించే అవకాశం ఉందన్నారు. చివరి రెండేళ్లలో హామీలన్నీ నెరవేర్చుదామనుకున్నానని, కానీ ఇంతలోనే ఎన్నికలు వచ్చేశాయని చంద్రబాబు నాయుడు చెప్పుకోవడానికి ప్రయత్నిస్తారని ఆరోపించారు. ఎన్నికల ముందు హామీలివ్వడం అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు అధైర్యపడవద్దని,తాను అండగా ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు,మంచి చేసినా ఫలితాలు నిరాశ కలిగించడంతోనే గతంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించానని చెప్పారు. రాజకీయాల్లో ఇలాంటి వ్యాఖ్యలు సర్వసాధారణమని, ఎన్నోసార్లు ఎంతో మంది నిరాశతో ఉన్నప్పుడు ప్రకటనలు చేస్తుంటారన్నారు. తాను క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. మూడేళ్లలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉండడంతో నాయకులు,కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజలకు అన్నిరకాలుగా అందుబాటులో ఉండి,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు ఇబ్బందులు కలిగిస్తే వారికి ఆయా గ్రామాల నాయకులు అండగా ఉండి మనోధైర్యాన్నివ్వాలని సూచించారు. నియోజకవర్గంలో కొందరు నాయకులు గత ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని, మళ్లీ ఇప్పుడు గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని, వారి ప్రయత్నాలు ఫలించవని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీల నాయకులతో అంటకాగే అలాంటి నీతిలేని నాయకుల పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల తరువాత కూడా తాను పార్టీ నాయకులందరికీ అందుబాటులో ఉంటున్నానని, ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలన్నారు.ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర,మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా,బెజవాడ నాగేశ్వరరావు,రంగా సాయి,సేనా పతి రాము,దూది నర్సింహమూర్తి,యల్లపు శ్రీరాములు,దాసరి కుమార్,వార్డు కౌన్సిలర్లు,పలు గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలపై దృష్టి సారించాలి



పల్లపు ఆనందపురంలో చెరకు తోటలను పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: చెరకులో తెగుళ్లను తట్టుకునే కొత్తరకం వంగడాలపై దృష్టి సారించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జి.గౌరీ సూచించారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో శనివారం ఆత్మ సౌజన్యంతో చెరకు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. భూసారానికి అనుగుణంగా కొత్తరకం వంగడాలను వినియోగించాలని సూచించారు. ఈ -పంట నమోదుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి కోరారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి విజేత మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యంపై దృష్టి చూపాలన్నారు. ఏఈవో సాయివాణి, వీఏఏ మాధవి,రైతులు అల్లవరపు రమణబాబు, రాజారావు, సియాద్రి కన్నారావు,రామారావు,ప్రకాశరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురజాడకు ఘనంగా నివాళి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(మునగపాక): సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మి తెలిపారు. గురజాడ 162 జయంతి సందర్భంగా అచ్యుతాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఆయన చిత్రపటం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లక్ష్మి మాట్లాడుతూ గురజాడ రచనలు ఎందరిలోనో మార్పులు తీసుకువచ్చాయన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు రామలక్ష్మి, సీఐటీయూ మండల కన్వీనర్ సోమునాయుడు, ఐద్వా ప్రతినిధులు సత్యవతి, అనూష,యశోద,అనిత, వెంకట్, సీపీఎం నేత రాము తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డికి సత్కారం



పోలిరెడ్డిని సత్కరిస్తున్న ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు

యలమంచిలి రూరల్: బ్యాడ్మింటన్‌లో పలువురు క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు కృషి చేసిన యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై పోలిరెడ్డిని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు,విశ్వ విద్యాలయం పరిధిలో ఫిజికల్ డైరెక్టర్లు శనివారం ఘనంగా సత్కరించారు. వర్శిటీ వార్షిక క్రీడా జనరల్ బాడీ సమావేశంలో పోలిరెడ్డి బ్యాడ్మింటన్‌లో దేశానికి,రాష్ట్రానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు.2023–24లో చైనా చెంగ్డులో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు భారతదేశం తరపున చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన పోలిరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు.ఈ మేరకు యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి చంద్రశేఖర్,అధ్యాపకులు,విద్యార్థులు పీడీ పోలిరెడ్డికి అభినందనలు తెలిపారు.

95 శాతం వరినాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: జిల్లాలో ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలతో వరినాట్లపై రైతులు దృష్టి సారించారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో టీ అండ్ వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ నెలలో నేటి వరకూ 30 శాతం అధిక వర్షం కురిసిందన్నారు. 95 శాతం వరినాట్లు వేశారన్నారు. ఇంతవరకూ వరిసాగు ఆశాజనకంగా ఉందన్నారు. జిల్లాలో వ్యవసాయశాఖ అధికారి ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 24 మండలాలకు 20 మండలంలో అధిక వర్షం నమోదైనట్లు చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నేటి వరకు వరి, చెరకు వంటి పంటలలో చీడ పీడలు గమనించలేదని, ఇప్పుడు వాతావరణ పరిస్థితులలో వరి పంటలో రాబోయే రోజులలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఆశించవచ్చునని తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా వీటిని నివారించవచ్చని చెప్పారు. శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, రమణమూర్తి, బి. భవాని, సిహెచ్ఎస్. రామలక్ష్మి, డి. ఉమామహేశ్వర రావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఉత్సవానికి ఏర్పాట్లు

కశింకోట: దుర్గమాంబ ఉత్సవం కోసం ఏర్పాట్లు చేపట్టారు.శనివారంవిద్యుత్ దీపాలంకరణ చేశారు. కశింకోటలో అమ్మవారి ఉత్సవం ఈ నెల 26న జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయం నుంచి స్థానిక సంతబయల వద్ద అమ్మవారి ముఖద్వారం వరకు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

లాడ్జీల్లో విస్తృతంగా తనిఖీలు



యలమంచిలి పట్టణంలోని లాడ్జీలో తనిఖీ చేస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలిరూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న పలు లాడ్జీల్లో యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించారు. లాడ్జీల్లో బస చేసేవారి పూర్తి చిరునామా,గుర్తింపు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి లాడ్జీల్లో ఆశ్రయం కల్పించకూడదని తెలిపారు.ఆకస్మిక తనిఖీలుకొనసాగుతాయనిస్పష్టం చేశారు.

రేగుపాలెం వద్ద వాహనాల తనిఖీ

మండలంలోని రేగుపాలెం హైవే కూడలి వద్ద శనివారం రాత్రి సీఐ ధనుంజయరావు,పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచుతామని సీఐ చెప్పారు.మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెడుతున్నాని చెప్పారు.ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను ఇప్పటికే గుర్తించడంతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు హైవే నిర్వహణ సంస్థ సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తనిఖీల్లో సీఐ సీసీ ఆచారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రీన్ ఫుడ్ కోర్టులో తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌వో రవికుమార్

హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీ

కోటవురట్ల: మండల కేంద్రం కోటవురట్లలోని గ్రీన్ ఫుడ్ కోర్టును ఫుడ్ సేఫ్టీ అధికారి శనివారం తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి.రవికుమార్ హోటల్‌లోని వంట పాత్రలు, ఆహారపదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రీన్ ఫుడ్ కోర్టుపై ఫిర్యాదు రావడంతో తనిఖీ చేసినట్టు తెలిపారు. సేకరించిన చికెన్, ఆహారాన్ని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. ఆహారంలో తేడాలు ఉంటే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవ



పోలీసు స్టేషన్‌లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: మండలంలోని పలు పాఠశాలలు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. పాఠశాలల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, శుభ్రపరిచారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కె.వెంకటాపురం, పాములవాక జెడ్పీ హైస్కూల్, రాజుపేట ఎంపీయూపీ స్కూల్ నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం



ముడిసరుకులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి

చోడవరం రూరల్ : లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చోడవరం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ తెలిపారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆమె సందర్శించారు. ఖైదీలకు ఆహార పదార్థాలను తయారు చేసే ముడి సరుకులను ఆమె పరిశీలించారు. వారికి నాణ్యమైన భోజన సదుపాయం అందుతున్నదీ లేనిదీ అడిగి తెలసుకున్నారు. అలాగే సబ్ జైలు సిబ్బంది ఖైదీల పట్ల మంచిగా మసలు కోవాలని సూచించారు. ఖైదీలు శాంతియుత జీవనానికి అలవాటు పడాలన్నారు. వారికి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. రిమాండ్ ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకున్నట్టయితే లోక్‌అదాలత్‌ను సంప్రదిస్తే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగితే సమాజంలో వారికి ఎప్పటిలాగే గుర్తింపు ఉంటుందన్నారు.

రాజయ్యపేట బీచ్‌లో ‘స్వచ్ఛ సాగర్’



తీరంలో చెత్తను సేకరిస్తున్న మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు, మెరైన్ పోలీస్ స్టేషన్

పాయకరావుపేట: మండలంలోని రాజయ్యపేట బీచ్‌లో ఇన్ కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తంగా స్వచ్ఛ సాగర్, సురక్ష సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ సంస్థ ప్రతినిధి జగదీష్ మాట్లాడుతూ కాలుష్యం కోరల నుంచి తీర ప్రాంతాన్ని కాపడడంతో పాటు మత్స్యకారుల్లో అవగాహన పెంచేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని చెప్పారు. సముద్ర జలాలు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ బి.నారీమణి, ఎస్ఐ డి.రత్నశేఖర్, హెచ్‌సీ వర్మ, జెడ్పీటీసీ కాసులమ్మ, ఎంపీటీసీ పిక్కి సత్యయ్య, సర్పంచ్ పిక్కి అప్పలనర్స, పిక్కి రాంబాబు, మాస్టర్ ప్రసాద్, పిక్కి గంగరాజు, మడదరాంబాబు, మైలపల్లి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాసుపల్లి శివ, కోదండరామ్, మత్స్యశాఖ అధికారులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు జోగులు పరామర్శ



రేవుపోలవరంలో రమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన రేవుపోలవరం మాజీ సర్పంచ్ చోడిపల్లి రమణ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కంబాల జోగులు శనివారం పరామర్శించి, ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు,వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, నాయకులు మధువర్మ, గనగళ్ల రాజేష్, పొలుమూరు అప్పలరాజు,అప్పలరాజు, గోవిందు తదితరులున్నారు.

గాయపడిన యువకుడికి పరామర్శ

విద్యుత్ ప్రమాదంలో గాయపడిన శివలంక అశోక్‌కుమార్ అనే యువకుడిని శనివారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పార్టీ తరపున సహాయం చేస్తానని ఆ యువకుడికి హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు,పార్టీజిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తదితరులున్నారు.

వృద్ధుల సంక్షేమ సంఘం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్క్ ప్రసాద్

చోడవరం : మండలంలోని నర్సయ్యపేట గ్రామంలో సుమారు 100 మందికి పైగా వృద్ధులు కలిసి వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సర్పంచ్ నాగబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వయో వృద్ధులకు రక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీన కంటి పరీక్షలు, గుండె జబ్బులు, ఫిజియోథెరపీ ఇతర వైద్య శిబిరాలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన వృద్ధుల సంఘం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు, ఐ డ్రీమ్ కో ఆర్డినేటర్ ఎం.రమేష్ పాల్గొన్నారు.